దప్పిలి శ్రీనివాసరెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే అన్నా

విశాలాంధ్ర-గిద్దలూరు : హైదరాబాద్ యర్రమంజలిలోని ఏషియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రోలజీ అండ్ యూరోలజీ హాస్పిటల్ నందు అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న గిద్దలూరు పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు దప్పిలి శ్రీనివాసరెడ్డిని శాసన సభ్యులు అన్నా రాంబాబు బుధవారం పరామర్శించారు. అనంతరం ఆయనకు అందుతున్న వైద్య సేవలను వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

అర్ధరాత్రి ఇసుక దొంగలు

పట్టుకునే అధికారే లేరా?

విశాలాంధ్ర-కొండపి : కొండపి నియోజకవర్గ కేంద్రమైన కొండపి ఇసుక దొంగలు రెచ్చి పోతున్నారు. ఈ అక్రమ ఇసుక వ్యాపారానికి ఇసుక దొంగలు అర్ధరాత్రి 1 గంట నుండి ఉదయం 4 గంటల నడుమ సమయపాలన పాటిస్తున్నారని సమాచారం. అయితే రాత్రి వేళలో ఉండాల్సిన బీట్ పోలీసుల కంట పడక పోవడం గమనార్హం. ఇదే అలుసుగా తీసుకొని ఇసుక వ్యాపారస్తులు రెచ్చిపోతు అక్రమ సంపాదనకు పాల్పడున్నారు. ఇకనైనా సెబ్, పోలీస్ అధికారులు అక్రమ ఇసుక రవాణాను అరికట్టడానికి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

వృద్ధుడికి ఆశ్రయం కల్పించిన 'సంజీవిని'

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలో పక్షవాతం సోకి దీనస్థితిలో యాచించుకుని ఆ వచ్చిన నగదుతో కడుపు నింపుకుంటూ తిరుగుతున్న 60 సంవత్సరాల ప్రసాద్ అనే వృద్ధుడికి సంజీవిని అనాధాశ్రమం ఆశ్రయం కల్పించింది. గిద్దలూరు పట్టణంలో యాచించుకుంటూ తిరుగుతున్న వృద్ధుడిని గుర్తించిన విలేజ్ ఫోర్స్ టీం అధ్యక్షుడు శశి కుమార్‌రెడ్డి ఆ వృద్ధుడితో మాట్లాడి సంజీవిని అనాధాశ్రమానికి ఆటోలో తీసుకు వెళ్లారు. ఆశ్రమంలో వృద్ధుడిని చేర్చుకోవాలని ఆశ్రమం నిర్వాహకుడు రాజశేఖర్‌ను అభ్యర్థించగా తక్షణమే అంగీకరించారు. మూడు రోజులుగా కడుపునిండా అన్నం తినలేదని ఆ వృద్ధుడు దీనంగా చెప్పాడు. తన ఊరు తిరుపతి అని పక్షవాతం సోకడంతో తన కొడుకు తనను వదిలేసాడని కన్నీళ్లు పెట్టుకుంటూ చెప్పాడు. అనాధగా తిరుగుతున్న వృద్ధుడిని విలేజ్ ఫోర్స్ టీం గుర్తించి సంజీవిని అనాధాశ్రమానికి తీసుకువచ్చి ఆశ్రయం కల్పించడంపై టీం సభ్యులను అధ్యక్షుడు శశి కుమార్‌రెడ్డిని ఆశ్రమం నిర్వాహకుడు రాజశేఖర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ కుమార్, శంకర్, బాబు, చరణ్, రాకేష్, భాషా తదితరులు పాల్గొన్నారు.

సొంత ఊరి అభివృద్ధికి కృషి అభినందనీయం

- బాల్య వివాహాలను అరికట్టాలి
- కలెక్టర్ దినేష్ కుమార్

విశాలాంధ్ర-సీఎస్‌పురం : ఉన్నత స్థాయిలో ఉండి తమకు జన్మనిచ్చిన సొంత ఊరి అభివృద్ధికి పాటు పడుతున్న ఆంధ్రప్రదేశ్ మాజీ చీఫ్ సెక్రటరీ అంగలకుర్తి విద్యాసాగర్ అభినందనీయమని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. మండలంలోని అర్రివేముల గ్రామంలో మండల ప్రాథమిక పాఠశాల ఆవరణంలో జరిగిన విద్యాసాగర్ తల్లిదండ్రులు అంగలకుర్తి ఆనందం నవమణి అయ్యవార్ల 20వ సంస్మరణ సభ బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి గ్రామాభివృద్ధికి ఆనందం, నవమణి ట్రస్ట్ ద్వారా అందజేస్తున్న సేవలను ఆయన కొనియాడారు. గ్రామంలో పాఠశాల రహదారి, తాగునీరు, స్మశాన వాటిక సమస్యల పరిష్కారానికి వెంటనే కృషి చేస్తామని అన్నారు. ఆనందం నవమణి 20వ సంస్మరణ సభలో అర్రివేముల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బాల్య వివాహాలపై నిర్వహించిన నాటకాన్ని కలెక్టర్ తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల చదువు విషయంలో ఆడ, మగ తేడా లేకుండా చదివించాలని ఆడ పిల్ల చదువుకు తల్లిదండ్రులు సహకరించాలని అన్నారు. మగ పిల్లలను పట్టణాల్లో పెద్దపెద్ద చదువులు చదివించి, ఆడ పిల్లలను గ్రామీణ ప్రాంతాలైన కేజీబీవీ పాఠశాలల్లో చదివిస్తూ ఆడపిల్లలపై చిన్నచూపు చూస్తున్నారని ఇలా చేయడం తల్లిదండ్రులకు కరెక్ట్ కాదని అన్నారు. ఆడ పిల్లలను 10వ తరగతి తరువాత చదువు మాన్పించడం ద్వారా అనేక సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన అన్నారు. చిన్న వయసులోనే ఆడ పిల్లలకు వివాహాలు చేయడం ద్వారా ప్రసూతి మరణాలు అధికమవుతున్నాయని అన్నారు. బాల్య వివాహాలలో రాష్ట్రంలో అనంతపురం జిల్లా తరువాత మన ప్రకాశం జిల్లా రెండవ స్థానంలో ఉందని అన్నారు. మహిళలు చదివితే దేశాభివృద్ధికి పాటుపడతారని అన్నారు. ఆడపిల్లలను ఉన్నత విద్య చదివించడం ద్వారా బాల్య వివాహాలు అరికట్టవచ్చని కలెక్టర్ తెలిపారు. అనంతరం చదువులో రాణించిన విద్యార్థినీ, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. అలాగే డ్వాక్రా మహిళలకు 30 మంది సభ్యులకు 40 లక్షల రుణాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్, ఆంధ్రప్రదేశ్ మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అంగలకుర్తి విద్యాసాగర్, కనిగిరి ఆర్డీవో సందీప్ కుమార్, ఎంపీడీఓ ఈశ్వరమ్మ, మెప్మా పీడీ రవి కుమార్, ఎంఈఓ జె ప్రసాదరావు, డిప్యూటీ తహశీల్దార్ మధుసూదన్ రావు, సర్పంచి రుక్మిణమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులు రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : బాల బాలికలు చదువుతో పాటు భారత రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలని వైద్యాధికారిని వి.జ్యోతి అన్నారు. మండల కేంద్రమైన ముండ్లమూరులో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఎస్ఓ ఏ.సునీత అధ్యక్షతన రాజ్యాగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జ్యోతి మాట్లాడుతూ భారత రాజ్యాంగం అత్యున్నత విలువలతో కూడినదని కుల మత భాషా జాతి మొదలైన తారతమ్యాలు లేకుండా అందరూ సమానమేనని రాజ్యాంగం చెప్పింది అన్నారు. వైద్యాధికారిని ఎం జాస్మిన్ మాట్లాడుతూ బాలికలు రాజ్యాంగం విలువలు తెలుసుకోవాలన్నారు. ప్రజలంతా సమానమేనని భావన కలిగి ఉండాలన్నారు. ఎస్ఓ ఏ సునీత మాట్లాడుతూ రాజ్యాంగంపై బాలబాలికలు తెలుసుకోవడం ఎంతో ఉపయోగకరమన్నారు. బాలల కోసం భారత రాజ్యాంగం ప్రవేశికలను గ్రంథాలయాలలో పెట్టడం జరిగిందన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ జిల్లా కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాన్ని వెలికి తీయడమే క్విజ్ పోటీల యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. వారిలోని మేధాశక్తిని పెంపొందించడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించి నటువంటి రాజ్యాంగ రచనలను విద్యార్థులకు తెలియజేయడం జరిగిందన్నారు. జనవరి 26 రిపబ్లిక్ డే దినోత్సవాన్ని పరిష్కరించుకొని విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించడం జరిగిందని ఆ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినిలకు సర్టిఫికెట్లు అందజేయడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కమ్యూనిటీ మొబిలైజర్ గోపన బోయిన వెంకటరావు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే జంక్షన్ మార్పు చేయాలి

విశాలాంధ్ర-సీఎస్‌పురం : గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే అనంతపురం- విజయవాడ హైవేలో భాగంగా స్థానిక డీజీపేట రోడ్డులో జంక్షన్ ఏర్పాటు కోసం ప్రభుత్వ భూమి ఉన్న తమ పొలాల్లో సర్వే చేస్తున్నారని సర్వే నిలిపివేసి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో హైవే జంక్షన్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్‌కు రైతులు, మండలంలోని అర్రివేముల గ్రామంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. సీఎస్‌పురం పంచాయితీలోని దర్శి తిమ్మక్కపల్లి రెవెన్యూ పరిధిలో 138, 139, 140, 141, 142, 143, 144, 169, 170, 171 సర్వేనెంబర్లలో దాదాపు 39 ఎకరాల భూమిలో గ్రీన్ ఫీల్డ్ హైవే జంక్షన్ కొరకు సర్వే చేస్తున్నారని కలెక్టర్‌కు వారు తెలిపారు. తామంతా సన్నకారు రైతులమని, దాదాపు 35 సంవత్సరాలుగా ఈ భూమిలో సాగు చేసుకుంటున్నామని తెలిపారు. మా భూములకు దక్షిణంవైపు ఉన్న 147/1లో 513 ఎకరాల్లో ప్రభుత్వ భూమి ఉందని, కావున మా భూములను వదిలివేసి జంక్షన్ ఎలైన్‌మెంట్ ప్రభుత్వ భూమిలోకి మార్చాలని రైతులు కోరారు. స్పందించిన కలెక్టర్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.

రాబోయే ఎన్నికల్లో అశోక్‌రెడ్డి గెలుపునకు కృషి

ముత్తుముల సమక్షంలో టీడీపీలో చేరిన 15 కుటుంబాలు

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాచర్ల మండలం, ఆకవీడు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు నీలి రామకృష్ణ, యాసం లక్ష్మిరెడ్డి, నిబ్బరగండ్ల రామచంద్రారెడ్డి, బీరం రామిరెడ్డిల ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 15 కుటుంబాలు గిద్దలూరు టిడిపి ఇన్చార్జ్, మాజీ శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి వారికి కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో గిద్దలూరు నియోజకవర్గంలో అశోక్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామని టీడీపీలో చేరిన పిన్నేబోయిన ఆదినారాయణ, పిన్నేబోయిన బాలయ్య, మండ్ల బాల రంగయ్య, షేక్ అషన్, షేక్ సమ్మేళ్ల, షేక్ సలీం, పన్నూరి రంగయ్య, రంగారావు, పాలకవీటి శివయ్య, శేఖర్, నాగేష్, తెల్లగోళ్ళ రాజగోపాల్, ఆవుల సుబ్బారెడ్డి, మందా రాములు, కోకటం శేషయ్య,మాధ తిరుపతి,మాద బ్రంహయ్యా, కురిచేటి పిచ్చి రంగయ్య, పాలకవీటి పెద్ద గురవయ్య, పాలకవీటి చిన్న గురవయ్య తెలియచేశారు.

ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి త్వరగా కోలుకోవాలి

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : మండలంలోని కోరప్రోలు ప్రాథమిక ఆరోగ్యకేంద్రమును జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి బుధవారం సందర్శించారు. డాక్టర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్యకేంద్రమునకు వచ్చు గర్భిణీలను వారి పూర్తి వివరములను ఆన్ లైన్‌లో ఎప్పటికి అప్పుడు నమోదు చేయవలెను. గర్భిణీలకు ఇవ్వవలసిన ఐరన్ మాత్రలు వారి ఆరోగ్య పరిస్థితి ఎప్పటికి అప్పుడు తెలుసుకుంటూ ఉండాలన్నారు. చిన్నపిల్లలకు ఇవ్వవలసిన టీకాలను క్రమం తప్పకుండ టీకాలు వేయవలెను అదే విధముగా ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని తెలిపారు. ఆసుపత్రిలోని మందులు రిజిస్టర్లు లను పరిశీలించారు. శీతలపెట్టె ఉష్ణోగ్రత రోజు మూడు సార్లు చూసుకోవాలి రిజిస్టర్‌లో నందు నమోదు చేయాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రములో పనిచేసే ప్రతి ఉద్యోగి రోజు మూడు సార్లు ముఖ హాజరు తప్పకుండా వేయాలన్నారు. శుక్రవారం డ్రైడే వివరములు అడిగి తెలుసుకున్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం క్రింద గర్భిణీలు మరియు బాలింతలకు వైద్య పరీక్షలు నవజాత శిశు సంరక్షణ సేవలు. పిల్లల్లో జబ్బులు ఎదుగుదల, పౌష్టికాహార లోపాలు గుర్తించేందుకు పరీక్షలు. బి.పి., షుగర్ ఇతర నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ రోగులకు రెగ్యూలర్ చెకప్. దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న వారిని డాక్టర్ వారిని ఇళ్ళ వద్ద పరీక్షించి సత్వర చికిత్స అవసరమైన వారిని దగ్గర లోని ఆరోగ్యశ్రీ గుర్తింపు పొందిన ఆసుపత్రికి వారిని తరలిస్తారు. డాక్టర్ వై.ఎస్.ఆర్ ఆరోగ్యశ్రీ క్రింద చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన రోగుల ఆరోగ్య పరిస్థితిపై ఫాలో అప్ చేస్తారు. ఈ కార్యక్రమములో డాక్టర్ ఎ శంకర్‌రెడ్డి, డాక్టర్ టి లక్ష్మీనారాయణ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'ఉగ్ర'ను భారీ మెజార్టీతో గెలిపించాలి

విశాలాంధ్ర-సీఎస్‌పురం : మాజీ ఎమ్మెల్యే కనిగిరి టీడీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని సీఎస్‌పురంలోని టీడీపీ కార్యాలయంలో ముక్కు ఉగ్రనరసింహారెడ్డి 50వ జన్మదిన వేడుకల సందర్భంగా పార్టీ కార్యాలయంలో స్థానిక సర్పంచి శ్రీరాం పద్మావతి టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో కేక్‌ను కట్‌చేసి ఉగ్రకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచి శ్రీరాం పద్మావతి మాట్లాడుతూ కనిగిరి మాజీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పేదల పాలిటి పెన్నిధి అని, వచ్చే ఎన్నికల్లో కనిగిరి టీడీపీ అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్‌సి మాలకొండయ్య, దాసరి మల్లికార్జున్, పఠాన్ నాయబ్‌రసూల్, ఒంగోలు పార్లమెంట్ యువత అధికార ప్రతినిధి షేక్ రజ్జాబ్‌బాషా, కనిగిరి టీడీపీ నియోజకవర్గ మహిళా నాయకురాలు లక్ష్మీదేవి, టీడీపీ నాయకులు వెంకటస్వామి, హాజీమలాన్, కోటిరెడ్డి, బత్తుల శ్రీను, రాగిని వెంకటేశ్వర్లు, వాసు, షేక్ షాను తదితరులు పాల్గొన్నారు.

రూ.10 వేలు ఆర్థికసాయం

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని 16వ వార్డు, పాములపల్లె రోడ్డులో నివాసం ఉంటున్న పేద కుటుంబానికి చెందిన కొత్తకోట సుజాత కుమార్తె కీర్తన వివాహం సందర్భంగా గిద్దలూరు టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ టీఎన్‌టీయూసీ అధ్యక్షులు ఉలాపు బాల చెన్నయ్య తన స్వంత నిధులు రూ. 10 వేల రూపాయలను వారికీ ఆర్థిక సహాయం అందచేశారు. పేద కుటుంబానికి చెందిన సుజాత కుమార్తె వివాహం ఉండగా వారి పరిస్థితిని గమనించిన స్థానిక టీడీపీ నాయకులు వారికీ ఆర్థిక సహకారం అందించారు. కుటుంబ సభ్యులు టీడీపీ నాయకులకు హృదయ పూర్వక ధన్యవాదములు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు గోపారపు గోపాల్‌రెడ్డి, రాచర్ల మండల ఉపాధ్యక్షులు చక్రి యాదవ్, ఒంగోలు పార్లమెంట్ తెలుగుయువత కార్యదర్శి సుండి వెంకటరమణ, పి.షరీఫ్, డి.హుస్సేన్, వినయ్, అబ్రహం, డి,నాగరాజు, ఓ తేజ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార కేసులో యువకుడిపై కేసు నమోదు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని ఉమామహేశ్వరపురం గ్రామానికి చెందిన బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న గుడాల కిరణ్మయిపై బెదిరించి రేప్ చేసిన అదే గ్రామానికి చెందిన చింతల వెంకటనారాయణరెడ్డి పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎల్ సంపత్ కుమార్ బుధవారం తెలిపారు. కిరణ్మయి విశాఖపట్నంలోని ఓ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. గత నెల జనవరి 11వ తేదీన చింతల వెంకట నారాయణరెడ్డి విశాఖపట్నం వెళ్లి యువతికి మాయ మాటలు చెప్పి లాడ్జికి తీసుకువెళ్లాడు. ఆ యువతిపై బలత్కారం చేసి ఫోటోలు వీడియోలు తీసి బెదిరించడంతో దీంతో మనస్థాపం చెందిన కిరణ్మయి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు కిరణ్మయిని ఒంగోలులోని ఓ హాస్పిటల్కి తీసుకువెళ్లగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాదుకు తీసుకు వెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలి తండ్రి గూడాల సుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్ సంపత్ కుమార్ తెలిపారు.

అపరిచిత వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి

- ఎస్సై బ్రహ్మానాయుడు

విశాలాంధ్ర-గిద్దలూరు : మండలంలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తూ ఉంటే తక్షణమే సమాచారం ఇవ్వాలని గిద్దలూరు ఎస్సై బ్రహ్మానాయుడు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఎవరైనా అనుమానస్పదంగా సంచరిస్తుంటే డయల్ 100కు కానీ లేదా మీ స్థానిక పోలీస్ స్టేషన్‌కు కానీ సమాచారం ఇవ్వాలని తెలిపారు. సమస్యాత్మకంగా ఉన్న ప్రదేశాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. అంతేకాకుండా ఎవరైనా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని అవి పని చేయకుండా ఉంటే వాటిని బాగు చేయించుకొని పనిచేసేలా చూసుకోవాలని కోరారు. ఇక దేవాలయాలలో కూడా నిర్వహకులు ఎప్పటికప్పుడు హుండీలోని నగదు విలువైన దేవుడివస్తులు జాగ్రత్త పరుచు కోవాలని విజ్ఞప్తి చేశారు. దొంగతనాలు నిరోధించేందుకు పోలీసులకు ప్రజలు సహకరించాలని అన్నారు.

సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చూడాలి

ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్

విశాలాంధ్ర-పామూరు : దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు ను అవినీతికి తావు లేకుండా అందిస్తున్న జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా రాష్ట్ర ప్రజలకు ఉందని కనిగిరి శాసనసభ్యులు టీటీడీ పాలక మండల సభ్యులు బుర్ర మధుసూదన్ యాదవ్ అన్నారు. బుధవారం స్థానిక శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థాన కళ్యాణ మండపంలో జరిగిన గృహ సారథుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని బుర్ర మధుసూదన్ యాదవ్ మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు జరుగుతుందో సంక్షేమ పథకాలు కూడా ఆదర్శంగా నిలిచాయన్నారు. ఎవరు చుట్టూ తిరగకుండా నేరుగా బటన్ నొక్కితే లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ కావడం జరుగుచున్నదన్నారు. రాష్ట్రంలో ప్రతి ఇంట జగనన్న సంక్షేమ పథకాలు వలన లబ్ధి ఉందన్నారు. అర్హులై పథకాలు అందని వారిని గృహ సారథులు గుర్తించి వలంటీర్ల ద్వారా దరఖాస్తులు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గంగసాని లక్ష్మి, వైసీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుస్సేన్‌రెడ్డి, వైసీపీ మండల యువజన అధ్యక్షులు, పట్టణ ఉప సర్పంచ్ యాదాల వెంకట సాయి కిరణ్, సర్పంచ్ అల్లూరి రాగమ్మ, వివేక విద్యాసంస్థల కరస్పాండెంట్ కల్లూరి రామిరెడ్డి, జెడ్పీటీసి చప్పిడి సుబ్బయ్య, వైసీపీ పట్టణ అధ్యక్షులు షేక్ చాంద్ భాష, గట్ల విజయభాస్కర్‌రెడ్డి, వైసీపీ షేక్ రషీద్, మాజీ జెడ్పీటీసి మేడబలిమి గురవయ్య, కందుల శ్రీనివాసులురెడ్డి, చల్లా సుబ్బారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతర్..!

ఐదు నెలలు గడుస్తున్నా చేపట్టని అభివృద్ధి పనులు



విశాలాంధ్ర-కంభం : అధికారుల అలసత్వం ఆ ప్రాంత వాసులకు శాపంగా మారింది. వివరాల్లోకి వెళితే కంభం మండలం కందులాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని అరాఫత్ నగర్‌లో గత 5 నెలల క్రితం గడప గడపకు మన ప్రభుత్వం కార్య క్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు పర్యటించారు. అరాఫత్ నగర్‌కు చెందిన 15 కుటుంబాల వారు వీధి దీపాలు లేవని, కరెంట్ స్తంభాలు, రోడ్డు మార్గం సరిగాలేవని, చుట్టుపక్కల చిల్లచెట్ల నడుమ చిమ్మచీకటిలో విషపురుగుల మధ్య చిన్న పిల్లలతో భయ భ్రాంతులతో జీవిస్తున్నామని ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు విన్నవించారు. ఆయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులను ఆదేశించారు. కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేసి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, అలానే చిల్లచెట్లు తొలగించి తాత్కాలిక మెటల్ రోడ్డు నిర్మాణం చేయాలని అధికారులకు సూచించారు. కాగా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు 5 నెలలు గడిచి పోయినా కూడా అటువైపుకు వెల్లడం కానీ, ఎమ్మెల్యే చెప్పినవి ఏర్పాటు చేయడం కానీ చేయలేదు.

అరాఫత్ నగర్‌లోని ఇళ్లపై గుర్తు తెలియని వ్యక్తుల దాడులు

ఇళ్ల చుట్టుపక్కల చిల్లచెట్లు, దానికి తోడు వీధి దీపాలు లేవు. దీంతో గత ఆదివారం నుండి ఇళ్ళల్లో మగవారు లేని సమయంలో రాత్రి 7 గంటల తరువాత నుండి గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేస్తున్నారు. ఆడవాళ్లు ఇళ్ళల్లో ఉన్న సమయంలో ఇంటి తలుపులు కొట్టడం, చిన్న పిల్లలను ఎత్తుకు వెళ్లేందుకు పిల్లల చేతులు పట్టుకు లాక్కెళ్తుంటే కేకలు వేయడంతో ఆ చిమ్మ చీకట్లో చిల్లచెట్ల నుండి తప్పించుకుపోవడం గత ఆదివారం నుండి ఇదే తంతుగా జరుగుతుంది. దీంతో గత ఆదివారం నుండి ఆ వీధిలోని మహిళలు, పురుషులు, చిన్న పిల్లలు కంటిమీద కునుకు లేకుండా రాత్రింబవళ్లు నిద్ర లేకుండా గడుపుతున్నారు.

పెట్రోలింగ్ పోలీసులను తప్పించుకుని తెగబడుతున్న దుండగులు

రాత్రి సమయంలో పోలీసులు పెట్రోలింగ్‌లో భాగంగా తిరుగుతుంటారు. కానీ పోలీసులు రాని సమయం, పోలీసులు వచ్చి వెళ్లిన సమయం చూసి గుర్తు తెలియని వ్యక్తులు గత 3 రోజులుగా ఇళ్లపై తెగబడుతూ దాదాపు 20 ఇళ్ల వారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. పోలీసులు ఇంకా కొంచం మా ఏరియాలో గట్టి నిఘా ఏర్పాటు చేయాలని, అలానే సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి మా ప్రాంతానికి తాత్కాలిక మెటల్ రోడ్డు, కరెంట్ స్తంభాలు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అరాఫత్ నగర్ వాసులు కోరుతున్నారు.

విద్యార్థినిపై అత్యాచార యత్నం

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని బొప్పూడి వారిపాలెం గ్రామానికి చెందిన లామ్ గోవిందయ్య అనే యువకుడు నాలుగో తరగతి చదువుతున్న బాలికపై బలాత్కారం చేయడంతో కేకలు వేసింది. బాలిక తల్లి లోవలక్ష్మి ఫిర్యాదు మేరకు ఫోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎల్ సంపత్ కుమార్ బుధవారం తెలిపారు.

వాటర్షెడ్ కమిటీ సమావేశం

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని తువ్వా పాడు గ్రామంలో వాటర్ షెడ్ అభివృద్ధి పనుల కమిటీ సమావేశం బుధవారం వాయిదా పడింది. అధికార పార్టీ వారే కమిటీ సభ్యులుగా ఏర్పాటు చేసుకోవడంపై ప్రతిపక్ష పార్టీవారు ప్రశ్నించగా ఇరు వర్గాల మధ్య వాదోపవాదాలు చోటు చేసుకోగా పోలీసు వారు వచ్చి సమావేశాన్ని వాయిదా వేయించారు.

ఆశా కార్యకర్త భర్తీకి ధరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర-పర్చూరు: పర్చూరు రెండవ గ్రామ సచివాలయ పరిధిలోని ఆశా కార్యకర్త ఖాళీని భర్తీ చేయుటకు దరఖస్తులు అందించాలని దగ్గుబాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు బి.స్రవంతి బుధవారం ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పదవ తరగతి ఉత్తీర్ణత సాధించాలన్నారు. 9 నుండి 12వ తేది వరకు దగ్గుబాడు పీహెచ్‌సీలో సంబంధిత ధృవ పత్రాలతో దరఖస్తులు అందించాలని డాక్టర్ స్రవంతి తెలిపారు.

'అశోక్‌రెడ్డి'ని గెలిపించుకుందాం

విశాలాంధ్ర-గిద్దలూరు : మండలంలోని తంబళ్లపల్లె గ్రామంలో గిద్దలూరు టిడిపి ఇన్చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక టిడిపి నాయకులు ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి వైసిపి పాలనలో ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో టీడీపీ నాయకులు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి నిత్యావసర ధరలు, ఇంటి పన్ను, చెత్త పన్నులు పెంచి, ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేసిందని, జగన్ పాలనలో ప్రజలకు ఒక్క సంక్షేమం కూడా అందలేదన్నారు. నాడు తెలుగుదేశం హయాంలో ముత్తుముల అశోక్‌రెడ్డి కృషితో, గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు, మంచినీటి సౌకర్యాలను కల్పించటం జరిగిందని, అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి పెన్షన్లు, పక్కా గృహాలు, మంజూరు చేయటం జరిగిందని గుర్తు చేశారు. గిద్దలూరులో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేసే ముత్తుముల అశోక్‌రెడ్డిని, తెలుగుదేశం పార్టీని రాబోవు ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ప్రజలకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పగడాల రమణ, కొత్తకోట శ్రీను, పగడాల తిరుపతయ్య, చిన్న రామయ్య, కొండా హనుమంతరెడ్డి, నాగం ఆదినారాయణ, మరియు మండల టీడీపీ అధ్యక్షులు మార్తాలా సుబ్బారెడ్డి, గొంటు బ్రహ్మారెడ్డి, చేరెడ్డి బయ్యపురెడ్డి, పాపిరెడ్డి, పార్లమెంట్ ఉపాధ్యక్షులు గోపారపు గోపాల్‌రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షులు ఉలాపు బాల చెన్నయ్య, చిలకల రమణ, బద్రి బాషా, చక్రీ యాదవ్, సురేష్‌రెడ్డి, మూల వెంకట్రామిరెడ్డి, దూదేకుల దస్తగిరి, బొర్రా రాఘవేంద్ర యాదవ్, ఎంవి సాయి తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ మార్కాపురం
6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

ఇ.పి. : 26/2019, ఒ.ఎస్. నెం : 8/2018

బత్తుల మల్లికార్జునరెడ్డి ....డి.హెచ్.ఆర్

Vs

తిరివీధి చిన్న వెంకటేశ్వర్లు .... జె.డి.ఆర్

టు,
తిరివీధి చిన్న వెంకటేశ్వర్లు, తండ్రి సత్యనారాయణ, డోర్.నెం. 7/32, అప్‌స్టైర్స్ విజయటాకీస్ రోడ్డు, గాంధీబజార్, మార్కాపురం, ప్రకాశం జిల్లా.

పై నెంబర్ ఇ.పి. మీకు నోటీసు నిమిత్తం అనేక పర్యాయములు కోర్టు ద్వారా మరియు రిజిష్టర్ పోస్టు ద్వారా నోటీసులు పంపిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు మీ నోటీస్ నిమిత్తము **తేది : 01-03-2023**కి వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు ఉదయం **10-30 గంటలకు** నీవు స్వయంగా గానీ, లాయర్ ద్వారా గాని కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనగలరు. లేనియెడల నీ పరోక్షమున పై దావా ఇ.పి. తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా : 01-03-2023

పోతిరెడ్డి బాలరంగారెడ్డి
డిహెచ్ఆర్ తరపు అడ్వకేట్, మార్కాపురం
సెల్ : 9440250869

ఫీల్డ్ అసిస్టెంట్లకు మెడికల్ కిట్లు పంపిణీ

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండలంలోని అన్ని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రభుత్వం నుంచి మంజూరైన మెడికల్ కిట్లను ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. వేసవి కాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉపాధి పనులు వేగం పుంజుకోనుంది. ఈ క్రమంలో కూలీల అత్యవసర వైద్యం కోసం మెడికల్ కిట్లను ఫీల్డ్ అసిస్టెంట్లకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి నలమలపు కృష్ణారెడ్డి, ఇన్చార్జి ఎంపీడీవో వేణు కుమారి, ఏపీవో ధనుంజయ వర్మ, ఈసీ విజయ కుమారి, పొలినేని కోటేశ్వరరావు, వినోదరాయుని పాలెం గ్రామ సర్పంచ్ ఘట్టమనేని అశోక్, జెట్టి శ్రీనివాసులు, తోకల శ్రీనివాసరావు, మద్దిసాని నాగేశ్వరరావు, ఇమ్మిశెట్టి బాల కృష్ణ, వివిధ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో 105 మందికి వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : గ్రామీణ ప్రాంతాలలో ఇంటింటా వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం 104 వాహనం ద్వారా ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా గ్రామాల్లో గల డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ వద్ద వైద్య శిబిరం నిర్వహించామని వైద్యాధికారి బి.మధు శంకర్ అన్నారు. మండలంలోని మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల సుంకరవారిపాలెం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ 104 సంచార వాహనం ద్వారా గ్రామాల్లో వైద్య సేవలు అందించి మెరుగైన ఫలితాలు తీసుకు వస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఇలాంటి శిబిరాలకు వచ్చి వైద్య సేవలు పొందాలని ఆయన అన్నారు. ఈ శిబిరంలో 105 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో 60 మందికి జలుబు దగ్గు జ్వరాలు. 3 బాలింతలు 3 గర్భవతులు 22 మందికి షుగర్. బిపి21 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసామన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఎస్‌కేయంయం సుభాని. ఏఎన్ఎం శారద. సిహెచ్ఓ రాజేశ్వరి. డీఈఓ వెంకటప్రసాద్. ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాల పంపిణీ పరిశీలన

విశాలాంధ్ర-దొనకొండ: స్థానిక సచివాలయం, గంగదేవిపల్లి సచివాలయాల్లో సిబ్బంది అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాలును జిల్లా వ్యాధి నిరోధక అధికారి పి.పద్మజ బుధవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణీలకు, ఏడాదిలోపు చిన్నారులకు టీకాలు ప్రతి బుధ, గురువారాల్లో అందించాలని తెలిపి అక్కడ అందిస్తున్న వివరాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని టీకాలు నిల్వలను తనిఖీ చేసి వైద్యాధికారి కె.సునీతకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాన్ని సందర్శించి వైద్యురాలు సునీతతో అనారోగ్యంతో ఉన్న పలువురు బాలికలకు పరీక్షలు నిర్వహించి, మందులు ఇప్పించారు. తాగునీరు వల్ల సమస్యలు వస్తున్నాయని, పూర్తిగా మినరల్ వాటర్ వాడాలని పాఠశాల సిబ్బందికి పద్మజ సూచించారు. ఆమె వెంట వైద్యురాలు కె.సునీత, సీహెచ్ఓ ఇన్యాసమ్మ, హెచ్ఈఓ కె.చంద్రశేఖర బాబు, సూపర్‌వైజర్ ప్రభావతిదేవి, ఏఎన్ఎంలు ఉన్నారు.

కోదండరామ స్వామిని దర్శించుకున్న ముత్తుముల

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు మండలం యర్రంశెట్టివానిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండ రామస్వామి ప్రతిష్ఠ కార్యక్రమంలో గిద్దలూరు టిడిపి ఇన్చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అశోక్‌రెడ్డిని పూలమాల శాలువా వేసి

ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర అప్పులపై శ్వేతపత్రం ప్రకటించండి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్
- అదానీ కుంభకోణంపై వైసీపీ,టీడీపీ ఎంపీల మౌనం ఎందుకు?

విశాలాంధ్ర-ఒంగోలు: రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రజలకు వాస్తవాలు తెలిసేలా శ్వేతపత్రం ప్రకటించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. బుధవారం ఒంగోలు వచ్చిన ఆయన సుందరయ్యభవన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగేళ్లలో ఇప్పటి వరకూ ఏడాదికి 45వేల కోట్లు చొప్పున అప్పులు పెరిగాయన్నారు. ప్రస్తుతం రూ. 4.45 లక్షల కోట్లకు అప్పు చేరిందన్నారు. ఇది రాష్ట్ర బడ్జెట్లో 25శాతంగా ఉందన్నారు. అప్పులు తెచ్చినా ఈరోజుకూ ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు, స్కీమువర్కర్లకు సకాలంలో జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. బకాయిలు చెల్లించలేని పరిస్థితి వచ్చిందని అన్నారు. స్కూళ్లు హాస్టళ్లలోని పిల్లలకు స్టేషనరీ, కనీసం సబ్బులు కూడా ఇవ్వలేక పోతున్నారని విమర్శించారు. అంగన్వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజనం పథకానికి సరుకులు కూడాఇవ్వడం లేదన్నారు. ఇంతటి ఆర్థిక సంక్షోభానికి ఎవరు కారణమని ప్రశ్నించారు. ప్రజలకు వాస్తవాలు తెలియాలన్నారు. రాష్ట్ర బడ్జెట్‌కు ముందే అప్పులపై శ్వేతపత్రం ప్రకటించాలని కోరారు. దేశాన్ని, రాష్ట్రాన్ని అన్ని రకాలుగా దోచుకుంటోన్న అధానీ కుంభ కోణాలపై పార్ల మెంటులో జరుగుతోన్న చర్చల్లో వైసిపి, టిడిపి ఎంపీలు ఎందుకు మౌనంగా ఉన్నారో ప్రజలకు సమాధానం

సమావేశంలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

చెప్పాలని డిమాండు చేశారు. అదానీకి అమ్మేశారన్నారు. రాష్ట్రంలో అదానీ ఎసోలార్ ఎనర్జీ కంపెనీలకు 75వేలఎకరంలో తయారయ్యే విద్యుత్తో ఐదారు లక్షలు వరకూ ఆదాయం వస్తుందన్నారు. అదే సరైన కంపెనీలకు ఇస్తే తయారయ్యే విద్యుత్ రైతులకు ఉచితంగా ఇవ్వడానికి వీలుందన్నారు. పేదలకు ఇవ్వొచ్చున్నారు. ఇలా అన్ని రకాలుగా రాష్ట్రానికి అన్యాయం చేస్తోన్న అదానీపై వైసిపి, టిడిపి ఎంపీలు నోరుమెదపకపోవడం దారుణమన్నారు. గతంలో కేంద్రం అన్ని పార్టీలపై నిఘా పెట్టినపుడు వైసిపి కూడా వ్యతిరేకించిందని గుర్తు చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజ నేయులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు పాల్గొన్నారు.

శరవేగంగా గ్రావెల్ రోడ్డు పనులు

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండలంలోని టి అగ్రహారం గ్రామం నుండి అమ్మనబ్రోలు, నాగులుప్పలపాడు ఆర్అండ్‌బి రోడ్డు వరకు గ్రావెల్ రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయి. గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డిలు ఇచ్చిన మాట ప్రకారం ఎంపీపీ నిధులనుంచి ఈ రోడ్డు అభివృద్ధి పనులు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపిటిసి పదా పవన్ కుమార్ మాట్లాడుతూ సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల దూరం ఉండే ఈ దారిలో గోతులు అధికంగా ఉండేవి వర్షాకాలంలో ఆ గోతుల్లోకి నీరు చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉండేవి. ఈ క్రమంలో ప్రస్తుతం ఎంపీపీ తన గ్రాంట్ నుంచి సుమారు 6.7 లక్షలు దీనిలో భాగంగా ముందుగా రోడ్డు ఎత్తు పల్లాలను సదరం చేసి క్యూరింగ్ చేశారు. అనంతరం గ్రావెల్‌తో పొరవేసి సదరం చేసి రోడ్ అభివృద్ధి చేస్తున్నాం అని అన్నారు. రోడ్డు నిర్మాణం పనులు తక్కువ రోజుల్లోనే పూర్తి చేస్తామన్నారు.

లింగయ్య చిత్రపటానికి నివాళి

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : వైఎస్ఆర్సిపి యువ నాయకులు చీర్వానుప్పాలపాడు- టీ అగ్రహారం ఎంపీటీసీ పొద పవన్ కుమార్ తండ్రి లింగయ్య ప్రధమ వర్ధంతి వారి స్వగ్రామమైన టి అగ్రహారంలో బుధవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు టీజేఆర్ సుధాకర్‌బాబు ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి పాల్గొని పొద లింగయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. వారి వెంట మండల పార్టీ అధ్యక్షుడు పోలవరపు శ్రీమన్నారాయణ, పొలినేని కోటేశ్వరరావు, గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి, కంచర్ల సుధాకర్ బాబు, దుంపా చెంచిరెడ్డి, జాగర్లమూడి వేణుగోపాల్, జెట్టి శ్రీనివాసులు, పి ఎస్ ఆర్, ఘట్టమనేని అశోక్ కుమార్, మద్దిసాని నాగేశ్వరరావు, తోకల శ్రీని వాసరావు, ఇమ్మిశెట్టి బాలకృష్ణ, యర్ర దశరథ రామయ్య, కొయి హనుమయ్య, కుమ్మరి సుధాకర్, పాలపర్తి ప్రవీణ్, కొండయ్య, రమణారెడ్డి, బక్కా అనంద్, రవి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా ఉగ్ర నరసింహారెడ్డిని గెలిపించాలి

విశాలాంధ్ర-వెలిగండ్ల : రాబోయే ఎన్నికలలో ఉగ్రన్న గెలుపు తథ్యం అని కనిగిరి మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, కేవలం ఇంద్ర భూపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కనిగిరి నియోజకవర్గ తెలుగుదేశం ఇన్చార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి జన్మదిన వేడుకలు ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఘనంగా మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకట్రెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోవు 2024 తెలుగుదేశం గెలుపు ఈ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కనిగిరిలో ఉగ్ర అన్న రాజ్యం అనివార్యమని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్స రాలు గడిచినప్పటికీ అభివృద్ధి శూన్యంగా ఉందని సంక్షేమ పథకాల పేరుతో ఉన్నవారి పథకాలను పీకేస్తున్నారని రాష్ట్రంలో పరిపాలన కుంటుబడిందని నియోజకవర్గంలో ఇష్టారాజ్యంగా అధికార పార్టీ నాయకులు వ్యవహరిస్తున్నారని అన్నారు. అనంతరం ఉగ్ర బర్తడే కేకును కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. తెలుగులో యువత అధ్యక్షులు కర్నాటి భాస్కర్‌రెడ్డి,

ఎస్సీ సెల్ నాయకులు యద్దనపూడి సాల్మన్ రాజ్, తెలుగు రైతు అధ్యక్షులు నిండుగా కాశయ్య, చందా బాలకాశిరెడ్డి, వెన్న రమణారెడ్డి, గౌరకట్ల హరి కృష్ణ, మౌలాలి, గోనా ప్రతాప్, కీసర రమణారెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు గోన వెంకటయ్య, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, మొటాటి వెంకటసుబ్బారెడ్డి, దాదిరెడ్డి సుబ్బారెడ్డి, బాలకృష్ణ, బండి శ్రీను, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దిల్లీలో రోడ్డు రవాణ శాఖ మంత్రిని కలసిన మాగుంట

విశాలాంధ్ర-ఒంగోలు: ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి కేంద్ర రోడ్డు రవాణ మరియు హైవేస్ శాఖ మంత్రి నితిన్ జైరాం గడ్కరి ని బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ గిద్దలూరులో రాచెర్ల రైల్వే గేటు వద్ద రైల్ ఓవర్ బ్రిడ్జి లేకపోవడం వలన ప్రజలు మరియు వాహన దారులు చాలా ఇబ్బందులు పడుచున్నారని, కనుక ఇచ్చట ఒక రైల్ ఓవర్ బ్రిడ్జీని సెంట్రల్ సి. ఆర్.ఐ.యఫ్. నిధులు మంజూరు చేయాలని, సి.ఎస్. పురం మండలం అంబవరం గ్రామం వద్ద నున్న శ్రీ భైరవేస్వరస్వామి వారి దేవస్థానానికి వెళ్ళుటకు భక్తులు మరియు పర్యాటకులు రోడ్డు సదుపాయం లేక ఇబ్బందులు పడుచున్నారని, కనుక బెంగుళూరు గ్రీన్ ఫీల్డ్ హైవే నుండి దేవస్థానం వరకు 3 కి.మీ. సర్వీసు రోడ్డు ఏర్పాటుచేయాలని మరియు చిలకలూరిపేట, నెల్లూరు సెక్షన్‌లో శింగరాయ కొండ వద్ద నిర్మాణంలో నున్న ఎమర్జెన్సీ లాండింగ్ ఫెసిలిటీ కి సంబంధించి మైనర్ బెండ్స్ (చిన్న వంకలు) మరియు కర్వ్ (మలుపు) లను సరిచేసి ప్రాజెక్టును పూర్తిచేయుటకు సత్వర చర్యలు తీసుకోవాలని కోరినారు. దానికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి, రైల్ ఓవర్ బ్రిడ్జికి సెంట్రల్ సి.ఆర్. ఐ.యఫ్. నిధులు మంజూరుకు, బెంగుళూరు లూరు గ్రీన్ ఫీల్డ్ హై వే నుండి శ్రీ భైరవేస్వరస్వామి వారి దేవస్థానం వరకు మూడు కి.మీ. సర్వీసు రోడ్డు ఏర్పాటుకు మరియు శింగరాయకొండ వద్ద ఎమర్జెన్సీ లాండింగ్ ఫెసిలిటీ పూర్తి చేయుటకు నిధులు మంజూరుకు తగిన చర్యలు తప్పక తీసుకుంటాని తెలిపారు.

ఘనంగా ఉగ్ర నరసింహారెడ్డి జన్మదిన వేడుకలు

కేక్ కటింగ్ చేస్తున్న టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మండల కేంద్రంలోని బుధవారం మాజీ ఎమ్మెల్యే మరియు టీడీపీ ఇంచార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి 50వ జన్మదిన వేడుకలు సందర్భంగా హనుమంతునిపాడు మండలంలోని టీడీపీ పార్టీ కార్యాలయం నందు మండల అధ్యక్షులు సానికొమ్ము తిరు పతిరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులందరూ కలసి దివ్యాంగుల సీతారాంపురం విద్యా కమిటీ చైర్మన్ స్థానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, అర్నూరి చెన్నయ్య,కొదమల యేసయ్యలుచే కేక్ కటింగ్ నిర్వహించి సర్వమత ప్రార్థనలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా హనుమంతునిపాడు మండలంలోని కస్తూరిబా పాఠశాలకు సానికొమ్ము తిరుపతిరెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్యలు కలసి తన సొంత నిధులతో రెండు ఫ్యాన్లు బహుకరించడం జరిగింది. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మురహరి నరసయ్య, రఘునాథ కాశిరెడ్డి, గంటా శ్రీనివాసులరెడ్డి (రైల్వేకాంట్రాక్టర్, బెంగళూరు), బ్రహ్మంగౌడ్, ఆర్టిఆర్, గాయం రామిరెడ్డి, కందుల వెంకట సుబ్బారెడ్డి, ముప్వ రంగ సాయి యాదవ్, చీకటి వెంకట సుబ్బయ్య, కోటపాటి శేషయ్య, గాయం కృష్ణారెడ్డి, కూడలి రోశయ్య, కూడలి దశరథ, గంగిరెడ్డి రమేష్‌రెడ్డి, చావలి వెంకటేశ్వర్లు, పెంచికల రామకృష్ణ, బాలా నారాయణ యాదవ్, బలసాని కోటయ్య, మాసేపోగు యర్రయ్య, దేవిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, దేవిరెడ్డి రాజారెడ్డి, టి.నారాయణరెడ్డి పాల్గొన్నారు.

విశాలాంధ్ర-పామూరు : కనిగిరి మాజీ శాసనసభ్యులు, టిడిపి ఇంచార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి 50వ జన్మదిన వేడుకలు సందర్భంగా పలుసేవా కార్యక్రమాలను మండలంలో చేపట్టారు. బుధవారం స్థానిక కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఉగ్ర నరసింహారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే కంబాలదిన్నె, తూర్పు కోడిగుడ్లపాడు, బొట్ల గూడూర్ తదితరు గ్రామాలలో కేకులు కట్ చేసి నరసింహారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణ తెలుగు యువత అధ్యక్షులు పందిటి హరీష్ సహకారంతో ఎర్రజేలు కాలనీలో గల మదర్సాలో విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు. అలాగే నుచ్చుపొద గ్రామ టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు బడుగు తిరుపతి వాసులు ఇటీవల మృతి చెందారు. ఉగ్ర నరసింహారెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని తిరుపతి వాసు కుటుంబ సభ్యులకు 55 వేల రూపాయల ఆర్థిక సాయంను టిడిపి మండల అధ్యక్షుడు పువ్వాడ వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ బొల్లా మాల్యాద్రి చౌదరి చేతల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మోరుబోయిన హుస్సేన్‌రావు యాదవ్, పందిటి హరీష్, యస్‌కె ఖాజా రాంతుళ్ళ, ఒంగోలు పార్లమెంట్ టిడిపి కార్యదర్శి, యస్‌డి అమీర్ బాబు, మండల తెలుగు రైతు అధ్యక్షులు మన్నం రమణయ్య, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు డోల శేషు, గురుబ్రహ్మం, దేవరపు మాల్యాద్రి, పాలపర్తి వెంకటేశ్వర్లు, గుంటుపల్లి శ్రీనివాసులు, పువ్వాడి రామారావు, షేక్ గౌస్ బాషా, ఆర్ఆర్ రఫీ, యదాల మాలకొండయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్య లబ్ధిదారుల కుదింపు దుర్మార్గం

- టీడీపీ నాయకుల నిరసన

విశాలాంధ్ర-ఒంగోలు: క్యూఎస్ పేరుతో విదేశీవిద్య లబ్ధిదారులను కుదించటం దుర్మార్గమని టిడిపి నాయకులు ధ్వజమెత్తారు. స్థానిక హెచ్‌సిఎం కళాశాల ఎదుట అంబేద్కర్ విగ్రహం వద్ద టిడిపి నాయకులు విదేశీ విద్యలో ఎస్సీ,ఎస్టీ,బిసి, మైనార్టీ, కాపు వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మోసానికి బుధవారం నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలలో ప్రతిభావంతులైన విద్యార్థులు విదేశాలలో విద్యను అభ్యసించేందుకు వీలుగా గత ప్రభుత్వాలు విదేశీవిద్య పథకాన్ని ప్రారంభించాయన్నారు. 2013 వరకు ఈ పథకంగా నిర్విఘ్నంగా కొనసాగిందన్నారు. 2014 నుండి 2018 మధ్య కాలంలో రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీ,బిసి, మైనార్టీ, కాపు పేద విద్యార్థులు 4,923 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10లక్షల వంతున రూ.364.98 కోట్లు చెల్లించటం జరిగిందన్నారు. అయితే వైసీపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత మూడున్నర సంవత్సరాలుగా ఈ పథకాన్ని మూలనపెట్టిందన్నారు. పైగా 2018-19 విద్యాసంవత్సరంలో ఈ పథకం ద్వారా విదేశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు రెండవ విడత ఇవ్వకుండా నానా ఇబ్బదులు పెట్టిందన్నారు. పైగా రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్

పేరును తొలగించి ముఖ్యమంత్రి పేరును పెట్టుకుని రాజ్యాంగాన్ని అవమానించారన్నారు. మరో వైపు క్యూఎస్200 ర్యాంకింగ్ కలిగిన వర్సీటీలలో సీటు వచ్చిన వారికి మాత్రమే పథకం వర్తిస్తుందని చెప్పటం దుర్మార్గ మన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, కాపు పేద విద్యార్థులను విదేశీవిద్యకు దూరం చేయటమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు డాక్టర్ గుర్రాల రాజ్‌విమల్, పసుపర్తి హగయ్యరాజు, చుండి శ్యాం, నావూరి కుమార్, జగన్నాథం, రామారావు, కపిల్ బాషా, పిల్లుట్ల సుధాకర్, తమ్మిశెట్టి రమాదేవి, రావూరి శ్రీను,నాలం నరసమ్మ,గోనె మేరీ కుమారి, మేరీ నిరీక్షణ కుమారి, కసుకుర్తి అంకరాజు, పాటిబండ్ల రాజశేఖర్, కోటపూరి వెంకటేశ్వర్లు, గొల్లపూడి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

టాటా ఏసీ, ఆటో ఢీ

- ఆటోడ్రైవర్‌కు తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : టాటా ఏసీ వాహనం కొబ్బరి బొండాలతో ఉన్న ఆటో ఎదురెదురుగా ఢీకొని ఆటోడ్రైవర్ తలకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని చిన్నారి కట్ల జంక్షన్ బచ్చల కూరపాడు మధ్యలో ఒంగోలు

నంద్యాల రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. స్థాని కులు తెలిపిన వివరాల మేరకు గొట్లగట్టు గ్రామానికి చెందిన జనపాల మురళి ఆటోలో కొబ్బరిబోండాలి వేసుకొని గొట్లగట్టుకు వస్తుండగా నంద్యాల నుంచి ఒంగోలు వెళ్తున్న టాటా ఏసీ వాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో ఆటో బోర్ల పడింది. ఆటో నడుపుతున్న మురళి తలకి తీవ్ర గాయా లయ్యాయి. దీంతో అక్కడున్న వారు 108కు సమాచారం ఇవ్వగా హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది గాయాలైన మురళిని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించినట్లు సమాచారం.

గృహసారథులు చిత్తశుద్ధితో పనిచేయాలి

- వరికూటి అశోక్ బాబు

విశాలాంధ్ర-మర్రిపూడి : గ్రామస్థాయిలో నియమితులైన గృహ సారధులు సచివాలయ కన్వీనర్లు, వైఎస్ఆర్సిపి విజయమే లక్ష్యంగా చర్చ సిద్ధితో పనిచేయాలని కొండేపి నియోజకవర్గ ఇంచార్జ్ వరికూటి అశోక్ బాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగిన వాలంటీర్ల సమా వేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు అందేలా పనిచేయాలన్నారు. సంక్షేమ పథకాలలో గత టిడిపి పాలన ప్రస్తుత వైఎస్ఆర్సిపి ప్రభుత్వానికి మధ్య తేడాలు దాని అమలుపరుస్తున్న విధానం గురించి ప్రజలకు తెలియచేయా లన్నారు. పేద ప్రజల అభ్యున్నతిని చంద్రబాబు నాయుడు ఓర్వలేక పోతున్నారని విమర్శించారు. మళ్లీ జగన్‌ను సీఎం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ మండల నాయకులు, వాలంటరీలు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రజలు పాల్గొన్నారు.

పవిత్రమైనది వైద్య వృత్తి

- ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్

విశాలాంధ్ర-పామూరు : వైద్య వృత్తి పవిత్రమైనదని, సేవాభావము కూడా వైద్యులకు ఉండాలని, మానవసేవే మాధవ సేవగా భావించాలని కనిగిరి శాసనసభ్యులు, టిటిడి పాలకమండలి సభ్యులు బుర్ర మధుసూదన్ యాదవ్ అన్నారు. బుధవారం స్థానిక నెల్లూరు రోడ్డులో శ్రీ వీరవెంకట సత్యనారాయణ దేవస్థానం ఎదురుగా ఏర్పాటు చేసిన సాఫల్య వైద్యశాలను బుర్ర మధుసూదన్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం వైద్య వృత్తిని వ్యాపార పరంగా కాకుండా సేవా భావంతో పనిచేసినప్పుడే ప్రజలలో పేరు ప్రతిష్టలతో పాటు ఆర్థికంగా ఎదగడానికి అవకాశం ఉంటుందన్నారు. జిల్లా కేంద్రానికి దూరముగా ఉన్న

పామూరు పట్టణంలో అత్యాధునిక పరికరాలతో పేద ప్రజలకు సేవలు అందించి పేరు ప్రతిష్టలు పొందాలని డాక్టర్ నాగమణిని బుర్ర మధుసూదన్ యాదవ్ ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షులు గంగసాని హుసేన్‌రెడ్డి, వైసీపీ యువజన అధ్యక్షులు పట్టణ ఉప సర్పంచ్ యాదాల వెంకట సాయి కిరణ్, జెడ్పిటిసి చప్పిడి సుబ్బయ్య, మంచి కంటి మధు, గట్ల విజయభాస్కర్‌రెడ్డి, షేక్ ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ లేఔట్ పరిశీలన

విశాలాంధ్ర-టంగుటూరు : టంగుటూరు మండలంలోని జగనన్న కాలనీలను బుధవారం పీసీసీ సభ్యులు మరియు ప్రకాశం జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు దేవరపల్లి సుబ్బారెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలు చిల్ల చెట్లతో నిండి అడవిని తలపిస్తున్నా యని, ప్రభుత్వ సహ కారం లేనందువల్ల లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకోలేక అవస్థలు పడుచున్నారన్నారు. రహదారులు రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, నీటి వసతి అవసరాలకు తగినట్టు లేవన్నారు. వీధి దీపాలు కూడా లేవన్నారు. మురుగు నీరు పోవుటకు కాలువలు డ్రయినేజ్ వ్యవస్థలేదని, కనుక తక్షణమే టంగుటూరులో ఉన్న జగనన్న కాలనీలలో లబ్ధిదారులకు అవసరమైన కనీస వసతులను ఏర్పాటు చెయ్యాలని కొండెపి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ తరుపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా మన్నారు. టంగుటూరు మాజీ ఎంపీటీసీ మరియు మాజీ జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బొడ్డు సతీష్, పొన్నలూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిల్లి భాస్కరరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కన్వీనర్ కుంచాల తిరుపతి, జరుగుమల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంచర్ల చంద్రశేఖర్, పొన్నలూరు సీనియర్ కాంగ్రెస్ నాయకులు తానికొండ శ్రీనివాసరావు, జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తూగుట్ల రమణారెడ్డి, టంగుటూరు యువ నాయకులు నేలకూరి ప్రదీప్ పాల్గొన్నారు.

దర్శి ఎమ్మెల్యేగా స్థానికులకు అవకాశం కల్పించండి

ఆవుల వెంకటరెడ్డి

విశాలాంధ్ర-కురిచేడు : కురిచేడు గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం మేజర్ పంచాయతీ సర్పంచ్ కేసనపల్లి కిష్టయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో కురిచేడు రెండవ సెగ్మెంట్ ఎంపీటీసీ ఆవుల లక్ష్మీదేవి భర్త వెంకట్‌రెడ్డి స్థానిక విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ దర్శి ఎమ్మెల్యే సీటు స్థానికులకు అవకాశం కల్పించాలని గత 30 సంవత్సరాల కాలము నుండి రాజకీయాల్లో ఉంటున్నానని నాకు అందరూ బాగా పరిచయస్తులు సహకరిస్తారని అన్నారు. ఇప్పటివరకు దర్శి నియోజకవర్గం పోటీ చేసిన అందరూ స్థానికులు కాకుండా ఎక్కడినుండి వచ్చి పోటీ చేసి గెలవకపోతే వెంటనే కనుమరుగైపోతున్నారని గెలిస్తే ఐదు సంవత్సరాల నుండి పోతున్నారని తన బాధను వెలబుచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో తాను స్థానికంగా ఉంటూ అందరికి సేవలు చేస్తూ మనలను పొందాలని గుర్తు చేశారు. పై నుండి వచ్చేవారు కాకుండా నాకు వైయస్సార్ పార్టీ తరఫున దర్శి ఎమ్మెల్యే సీటు ఇస్తే 70

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

వేల మెజార్టీతో గెలుస్తానని అన్నారు. నియోజకవర్గంలో చాలా సమస్యలు ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరిస్తానని ఇక 30 సంవత్సరాల వరకు జగన్ మన రాష్ట్ర ముఖ్యమంత్రి అన్నారు. శ్రీరాముడు పాదము మోపిన పాలనగా ఉందన్నారు. దర్శికి అధిష్టానము ఎవరికి సీటు ఇచ్చిన వారికి కట్టుబడి ఉండి వారి గెలుపుకు అశేష కృషి చేస్తామన్నారు. అనంతరం స్థానిక పాత్రికే యులకు గౌరవప్రదంగా పెన్నులు డైరీలు అందజేశారు.

ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై దుకాణదారులతో సమావేశం

విశాలాంధ్ర-దొనకొండ: స్థానిక పంచాయతీ కార్యా లయంలో సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్న దేవానంద్ అధ్యక్షతన ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై దుకాణదారులతో సమావేశం బుధవారం జరిగింది. సర్పంచ్ మాట్లాడుతూ దొనకొండ పంచాయతీలో దుకాణదారులు, చిరు వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు వాడకంపై ప్రచారం చేసి జనవరి 26 నుండి నిషేధం అమలులో ఉందన్నారు. సరుకులు ప్లాస్టిక్ కవర్లలో అమ్మిన వారికి రూ.1000, కొన్న వారికి రూ.500 జరిమాన వేయటం జరుగుతుందన్నారు. ఇప్పటికే 18 మందికి జరిమాన వేయటం జరిగిందని, ఈ నగదు గ్రామ పంచాయతీకి జమ అవుతుందని తెలిపారు. క్లాత్ సంచులు పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవటంతో వ్యాపారం నష్టం జరుగుతుందని, మరో 10 రోజులు గడువు పెంచాలని పండ్ల వ్యాపారి రామక్రిష్ణ కోరారు. 70 శాతం కవర్లు అన్ని నగరాల్లో ఇంకా వాడకంలో ఉన్నాయని, ఫ్యాక్టరీలో తయారీలను ఆపు చేసే చర్యలు తీసు కోవటమే దీనికి పరిష్కారమని కిరాణ వ్యాపారి అంజి అన్నారు.

పందులు, కుక్కలు, కోతులను నివారించేందుకు వేయని జరిమాన కవర్లు వాడుతూ చిరు వ్యాపారం చేసుకునే వారికి వేయటం తగదంటూ పలువురు సమావేశంలో తెలిపారు. స్పందించిన కార్యదర్శి క్రిష్ణమూర్తి 2021లోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాస్టిక్ కవర్ల కంపెనీలపై నిషేధం చేశాయని, దొంగచాటుగా అమ్ముతున్న కంపెనీలను అరికట్టేందుకు ప్రజలందరూ కలిసి సహకరించాలని కోరారు. పందులకు, కుక్కలకు ఆహార పదార్థాలు, వ్యర్థ పదార్థాలు హోటళ్ళు, దుకాణాలు, ఇంటి పరిసరాల్లో పడవేయకుండా ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా వ్యవహరిస్తే వాటిని నివారించటం పెద్ద సమస్య కాదని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పఠాన్ ఇమ్రాన్‌ఖాన్, వార్డు సభ్యులు కె.రామారావు, ముజాయిద్, బత్తుల వెంకటసుబ్బయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.